క్లుప్తంగా

పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: మండలంలోని అంతర్గాంలో బుధవారం పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, మాజీ ఎంపీపీ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ ఎంపీకి వినతి


వినతిపత్రం ఇస్తున్న మున్నూరుకాపు సభ్యులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ జంగిలి సునీత ఆధ్వర్యంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్రను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. తమ సంఘం డైనింగ్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తిరుపతి,సభ్యులు ఆదిరెడ్డి,రమేశ్,సాగర్,శ్రీనివాస్, సంజీవ్, రాజేందర్, రమేశ్, సందీప్, సాయిరెడ్డి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన నాయకులు


పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను కలిశారు. ఎస్సీ వర్గీకరణ త్వరగా అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విన్నవించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తెడ్డు శేఖర్, శనిగారపు గణేశ్, మొలిగె శ్రీనివాస్, కలిగోట రాజయ్య, బాలె నీలకంఠం, తెడ్డు ప్రశాంత్, రోషన్, గణేశ్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతా

జగిత్యాల: శాసనమండలిలో ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడుతానని ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి మంద జ్యోతి అన్నారు. బుధవారం కార్యాలయంలో మాట్లాడుతూ పట్టభద్రులు తనకు ఒక్కసారి అవకాశం కల్పించాలని, సమస్యలపై ప్రభుత్వంపై నిత్యం పోరాటం చేస్తామని చెప్పారు. కోటీశ్వరులు, సామాన్యులకు మధ్య పోటీ జరుగుతుందని, పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, తిరుపతి, ఉపేంద్ర పాల్గొన్నారు.

గోసంగి కులాన్ని ప్రత్యేక గ్రూపులో చేర్చాలి

మెట్‌పల్లి: గోసంగి కులాన్ని ప్రభుత్వం ప్రత్యేక గ్రూపులో చేర్చి ఆదుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల సాయిచరణ్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం మాట్లాడారు. మాల ఉప కులాల జాబితాలో గోసంగిని చేర్చడం వల్ల ఆ వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో మాదిగ, మాలల తర్వాత గోసింగి కులస్తులు అత్యధిక సంఖ్యలో ఉన్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రత్యేక గ్రూపులో చేర్చాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు జన్నారపు రాజేశ్, రవీందర్, రమేష్, కలమడుగు తిరుపతి, కుమ్మరి రామస్వామి పాల్గొన్నారు.

పెంపుడు పిల్లులకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించాలి



జగిత్యాల: ఇళ్లలోని పెంపుడు పిల్లులకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ ఇప్పించాలని వెటర్నరీ అధికారి పూర్ణచందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పెంపుడు పిల్లులకు యాంటీ రేబీస్ నిరోధక టీకాలతో పాటు డీ వార్మింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వ్యాక్సిన్ వేయించేలా చూసుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడు

జగిత్యాల/జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్/ధర్మపురి/రాయికల్/మెట్‌పల్లిరూరల్/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/మల్యాల/సారంగాపూర్/పెగడపల్లి: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాలు, గ్రామాల్లో శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశభక్తికి, ధీరత్వానికి మారుపేరు శివాజీ మహరాజ్ అని, నేటి తరానికి శివాజీ ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వీహెచ్‌పీ బజరంగ్‌దళ్,వివిధ హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కోరుట్ల రూరల్: శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


ధర్మపురిలో మహా ర్యాలీ


జగిత్యాల: శివాజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జ్యోతి


పెగడపల్లి: జయంతి వేడుకల్లో శివదీక్షా పరులు


బండలింగాపూర్‌లో శివాజీ జయంతి వేడుకలు


ఇబ్రహీంపట్నంలో..


రాయికల్‌లో నాయకుల నివాళి

చెక్‌పోస్ట్ వద్ద పకడ్బందీగా తనిఖీ

మెట్‌పల్లిరూరల్: ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్టకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. జిల్లా సరిహద్దు శివారులోని గండి హనుమాన్ ఆలయం వద్ద చెక్‌పోస్ట్‌ను బుధవారం సందర్శించి, వాహనాలు తనిఖీ చేశారు.సిబ్బందికి పలు విషయాలపై సూచనలిచ్చారు. అనుమతుల్లేని ఇసుక ట్రాక్టర్,లారీలపై పక్కాగా నిఘా పెట్టాలన్నారు. అనుమతి లేని ఇసుక వాహనాలు చెక్‌పోస్ట్ దాటి వెళ్లినట్లు తెలిస్తే సిబ్బందిపై చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఏమైనా ఒత్తిడిలు,ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


అనుమతి పత్రాలు పరిశీలిస్తున్న సీఐ

పాఠశాలల్లో మానిటరింగ్ సభ్యుల పరిశీలన

రాయికల్: మండలంలోని తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఇటిక్యాల హెచ్‌ఎం సదాశివ్, మానిటరింగ్ టీం సభ్యులు చెరుకు మహేశ్వర శర్మ, వేముగంటి గిరిధర్ పదో తరగతి అంతర్గత పరీక్షల, ఎఫ్‌ఏ మార్కులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తుందని, వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలని, ఆదిశగా విద్యార్థులు ఇష్టపడి చదివి ధైర్యంతో భయం లేకుండా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్, శ్రీధర్ జగన్, రాజేందర్, హరీశ్, శ్రీదేవి, రాజేశం, సుజాత, సీఆర్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న మానిటరింగ్ కమిటీ సభ్యులు

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

వెల్గటూర్: మండలంలోని స్తంభంపల్లి నుంచి రాజారాంపల్లి వరకు 7వ నెంబర్ రాష్ట్ర రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. రహదారిపై ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని, వాహనదారులను అప్రమత్తం చేయడానికి, ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఉమాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.


హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న సీఐ, ఎస్సై

నర్సింహులపల్లె అంగన్‌వాడీ భవనాన్నీ ఆక్రమించారు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలోని అంగన్‌వాడీ భవనాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం లేఖ రాశారు. గ్రామానికి చెంది న ఓ అంగన్‌వాడీ టీచర్, ఆమె భర్త, మరొకరి సహాయంతో భవనాన్ని ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని లేఖలో కోరారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

రాయికల్: పట్టణంలో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు మంజూరు చేయమని పంచాయతీరాజ్ డీఈ మిలింద్ హెచ్చరించారు. ఈనెల 17న 'అస్తవ్యస్తంగా మురికికాలువ నిర్మాణ పనులు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఈ పట్టణంలోని 9, 2 వార్డులతో పాటు పలు వార్డుల్లో నిర్మించిన సీసీరోడ్లు, మురికికాలువ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్లు నాణ్యతాలోపంతో నిర్మిస్తే బిల్లులు నిలిపివేస్తామని స్పష్టం చేస్తామన్నారు. ఆయన వెంట ఏఈ ప్రసాద్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్: రాయికల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల, తాట్లవాయిలో గ్రామాల్లో ఉదయం 9 నుంచి 1 గంటల వరకు, వీరాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈలు రాజేశం, నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఇటిక్యాలలో నేత్ర వైద్య శిబిరం

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో రాయికల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మచ్చ శేఖర్ కార్యదర్శి కడకుంట్ల నరేశ్, కోశాధికారి కట్ల సర్సయ్య బుధవారం తెలిపారు. రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యుల హాజరవుతున్నారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శివ దీక్ష స్వాములు

బుగ్గారం: మహాశివరాత్రి జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని సాంబశివ నాగేశ్వరాలయ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి అన్నారు. ఈనెల 24 నుంచి 27 వరకు నిర్వహించే మహా శివరాత్రి వేడుకల ఆహ్వాన పత్రికలు, పోస్టర్లను బుధవారం శివ దీక్షస్వాములతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, అంజయ్య, రాగన్న, మల్లేశం, చుక్క గంగారెడ్డి, పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

వెల్గటూర్: విద్యార్థుల సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగి, వారి సమస్యల కోసం నిరంతర పోరాటం చేసే అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ కోరారు. బుధవారం వెల్గటూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మట్లాడారు. నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోపిక, వైస్ చైర్మన్ తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించుకుందామని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. నరేందర్‌రెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామంలో ప్రచారం చేశారు. మాజీ ప్రజాప్రతినిధులు శోభారాణి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణహరి, మల్లేశం, అంజయ్య, రవి, వెంకట్‌రావు మండల కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

కోరుట్ల విద్యార్థినులకు కేంద్ర బహుమతులు



బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోరుట్ల: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ బహుమతులు గెలుచుకున్నారు. పాఠశాలలో 6, 7వ తరగతి విద్యార్థినులకు కబడ్డీ, ఖోఖో, గిల్లదండ, చదరంగం, లిగోర్, చార్‌పల్లి, కైలాసం, పులిమేక ఆటల పోటీలు నిర్వహించారు. వాటిని చిత్రాల రూపంలో కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖకు పంపించారు. స్వదేశీ క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ బాలికల పాఠశాలకు ప్రథమ బహుమతి ప్రకటించింది. ఇందులో 14 మంది విద్యార్థినులు బహుమతులు గెలుచుకున్నారు. బహుమతులను కేంద్ర ప్రభుత్వం పోస్టుద్వారా పాఠశాలకు పంపించింది. విజేతలను హెచ్‌ఎం కృష్ణమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థినికి అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న ఇన్‌స్ట్రక్టర్

ధర్మపురి: మండలంలోని తుమ్మెనాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని నందిని ఇటీవల సిరిసిల్లా జిల్లా కేంద్రంలో జరిగిన కుంగుఫూ కరాటే రాష్ట్ర స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. బుధవారం పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్ ప్రవీణ్‌కుమార్, మామిడిపెల్లి గణేశ్, మండల విద్యాధికారి సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

శివాజీ విగ్రహాలు ఆవిష్కరణ


పోసానిపేటలో శివాజీ విగ్రహావిష్కరణలో యువకులు

కథలాపూర్/మల్యాల: కథలాపూర్ మండలం పోసానిపేట, మల్యాల మండలం నూకపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహాలు ఆవిష్కరించారు. శివాజీ సేన యూత్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. కథలాపూర్‌లో శివాజీ విగ్రహ నిర్మాణానికి యువకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.



డ్రైయినేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

పారిశుధ్యంపై పర్యవేక్షణ కరువు

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామంలో డ్రైయినేజీలు కంపు కొడుతున్నాయి. ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ లేకపోవటంతో డ్రైయినేజీల్లో చెత్త పేరుకుపోయింది. గ్రామపంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేక పోవటంతో పర్యవేక్షణ ఇబ్బందిగా మారింది. ఇక్కడ విధులు నిర్వహించిన కార్యదర్శి వేరే డిపార్ట్‌మెంట్‌కు వెళ్లటంతో యూసుఫ్‌నగర్ పంచాయతీ కార్యదర్శికి ఇన్‌చార్జిగా నియమించారు. రెండు గ్రామాల్లో విధులు నిర్వహించటం కార్యదర్శికి ఇబ్బందిగా మారింది. గ్రామ పంచాయతీలో పనుల కోసం వచ్చే ప్రజలు కార్యదర్శి అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల వీధి దీపాలు వెలుగక పోవటంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కారొబార్‌కు పన్నులు వసూళ్లు, ఇతర పనులు భారంగా మారాయి. ఇప్పటికైనా రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి


మాట్లాడుతున్న భోగ శ్రావణి

ఇబ్రహీంపట్నం: పట్టభద్రులు, ఉపాధ్యాయ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి చిన్నమైల్, మల్క కొమురయ్యలను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త మొదటి ప్రాధాన్యత ఓటు వేయించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి, మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి, నాయకులు బత్తుల శ్రీనివాస్, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, తీగల శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం

సారంగాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీతో పాటు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఓటు వేసే విధానంతో పాటు, ఓటును బీజేపీ అభ్యర్థులకు వేయించడంపై బీర్‌పూర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం సమావేశం నిర్వహించి చర్చించారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం ఎలా పనిచేయాలనే దానిపై నాయకులు, కార్యకర్తలు అభిప్రాయాలను తెలియజేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు ప్రబారి రాజేశ్, ఆడెపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యమకారుల ఫోరం చైర్మన్ జవ్వాజి శంకర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం పోస్టు కార్డులపై తమ సమస్యలను రాసి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు, రూ.25 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాగుల రాజు, భారతపు లింగారెడ్డి, ప్రేమ్‌కుమార్, సతీశ్, ఉమేందర్, రాకేశ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు

గొల్లపల్లి: మండలంలోని నల్లగుట్ట వద్ద సర్వే నంబర్ 544లోగల ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులూ లేకుండా మట్టి తవ్వకానికి పాల్పడడమే కాకుండా అడ్డుకునేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై దురుసుగా ప్రవర్తించిన ఒడ్డె రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిహెచ్.సతీశ్ తెలిపారు. తమపై దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించారని రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అతిగా మద్యం సేవించి యువకుడు మృతి

ధర్మపురి : అతిగా మద్యం సేవించి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నక్కలపేట గ్రామానికి చెందిన బండారి లక్ష్మి ముగ్గురు కూతుళ్లు, బండారి భూమేశ్ (32) అనే కుమారుడు ఉన్నాడు. భూమేశ్ గత కొంత కాలం నుంచి తాగుడుకు బానిసయ్యాడు. ఈనెల 14న లక్ష్మి తన బంధువుల ఇంటికెళ్లగా, ఇంటి వద్ద ఉన్న భూమేశ్ అతిగా మద్యం సేవించి నీరు, తిండి లేక పోవడంతో మంచంపైనే పడుకొని మృతి చెందాడు. బుధవారం ఇంటికి వచ్చిన తల్లి తలుపు తట్టి చూడగా కొడుకు భూమేశ్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెకానిక్ షాప్ దగ్ధం

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో బుధవారం చింతకింది లక్ష్మీనారాయణకు చెందిన మెకానిక్ షాప్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడి కథనం ప్రకారం గ్రామంలో మెకానిక్ షాప్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా నన్నారు. కాగా రోజు మాదిరిగానే బుధవారం ఉదయం షాప్ దగ్గరికి వచ్చి చూసేసరికి బైకులు, సైకిళ్లు పూర్తిగా దగ్ధమై కనిపించాయన్నారు. షాప్ ప్రమాదవశాత్తు దగ్ధమయిందా.. గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారోనని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

పెగడపల్లి: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ ఒరుగల కొమురెల్లి(65)అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. 1999 నుంచి 2004 వరకు పెగడపల్లి సర్పంచ్‌గా సేవలందించారు. మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

ధర్మపురి: పాత సామగ్రి ఏరుకునేందుకు వచ్చి దొంగతనానికి ప్రయత్నించిన ఐదుగురు మహిళలను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో చోటుచేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి వేళ కొందరు మహిళలు పడేసిన సామగ్రిని ఏరుకునేందుకు గ్రామానికి వచ్చారు. పలువురి ఇళ్లలోకి ప్రవేశించి చిన్నచిన్న వస్తువులను దొంగిలించే ప్రయత్నం చేశారు. కాలనీవాసులు అప్రమత్తమై వారిని పట్టుకున్నారు. అనంతరం బుధవారం ఉదయం పోలీసులకు అప్పగించగా.. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

సారంగాపూర్: చెట్టుకు మంచె వేసుకున్న రైతు ఐడియాకు పలువురు హ్యాట్సాఫ్ చెబుతున్నారు. వరి, మొక్కజొన్న, నువ్వు, ఇతర పంటలను పక్షులు, అడవిపందులు, ఇతర వన్యప్రాణుల నుంచి కాపాడుకునేందుకు కాపలా తప్పనిసరి. అయితే రాత్రి సమయంలో నేలపై నిద్రిస్తే విషపురుగుల నుంచి హాని ఉంటుంది. దీంతో చెట్టుకు ఇలా మంచె వేసుకున్నాడు. మండలంలోని కోనాపూర్-జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట గ్రామాల మధ్య ఓ చెట్టుకు వేసిన మంచెను చూసి పలువురు అభినందిస్తున్నారు.


చెట్టుకు మంచె